
సాక్షి ఒడిశా
శనివారం । 28 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,33,881
బంగారం	1 గ్రాము 50 మిల్లీ గ్రాములు
వెండి	45 గ్రాముల 570 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

గజపతి జిల్లా గుసాని సమితి గారబంద పంచాయతీ బాదుర్‌పేట వద్ద ఒక ట్రాక్టర్‌లో టేకు కలప అక్రమంగా తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు.

- 8లో



వేతనాలు పెంచాలని ఆందోళన

గజపతి జిల్లాలో వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ భారత్ ఖేత్ మజ్దూర్ సంఘ్ నేతలు ఆందోళన చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

లింగరాజు ఆలయంలో చంద్ర గ్రహణం సేవలు

భువనేశ్వర్: ఈనెల 28వ తేదీన కుమార పౌర్ణమి తిథి నాడు పాక్షిక చంద్ర గ్రహణం సంభవిస్తుంది. ఈ సందర్భంగా శ్రీ లింగరాజు దేవస్థానంలో పూజాదుల వేళలు సవరించారు. శనివారం సాయంత్రం 4.15 గంటలకు అన్ని పూజా కార్యక్రమాలు ముగిస్తారు. ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య మంగళ హారతి, ఇతర ప్రాతః కాల సేవలు ముగిస్తారు. అనంతరం ఉదయం 9.30 గంటల వరకు సర్వ దర్శనం పరిమితం చేశారు. తదుపరి గర్భ గుడి శుద్ధి, మహా ప్రభువు అభిషేకం, సంధ్యా ధూపం, కార్తీక పూజ ఇత్యాది పూజాదులు సాయంత్రం 4 గంటలకు ముందే పూర్తి చేస్తారు.

బిందు సరోవరంలో...

పాక్షిక చంద్ర గ్రహణం వీడిన తర్వాత అర్ధరాత్రి లింగ రాజు మహా దేవునికి గ్రహణ స్నానం జరుగుతుంది. స్థానిక బిందు సరోవరంలో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఇక్కడి కార్యక్రమం ముగియడంతో అర్ధరాత్రి 2.15 గంటలకు ప్రధాన దేవాలయంలో గ్రహణ భోగం నివేదిస్తారు. అనంతరం మూల విరాటుకు బొడా సింగారం అలంకరణ చేస్తారు. మరుసటి రోజు ఆదివారం నుంచి నిత్య పూజలు, సేవాదులు యథాతథంగా కొనసాగిస్తారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం లోపల, బయట పూలు, దీపాలు, ఫలహారాల దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.

నేటి నుంచి కార్తీక వ్రతం ప్రారంభం



బస ప్రాంగణంలో సామూహిక కార్తీక వ్రతంలో హబిష్యాలీలు (ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్రంలో శనివారం నుంచి భక్తులు కార్తీక వ్రతం ప్రారంభించనున్నారు. వ్రతం కోసం విచ్చేస్తున్న భక్తుల తాకిడి క్రమంగా పుంజుకుంటుంది. వీరి కోసం పూరీ జిల్లా యంత్రాంగం వసతి, భోజనం తదితర ఏర్పాట్లు చేసింది. పూరీ పుణ్యక్షేత్రంలో అధికార యంత్రాంగం నిర్ధారించిన శిబిరాల్లో ఈ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అలాగే కార్తీక వ్రతం పురస్కరించుకుని ముందస్తుగా వివరాలు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఈ శిబిరాల్లో బస చేసి వ్రతం ఆచరించేందుకు అనుమతిస్తారు. పట్టణంలో 5 చోట్ల హబిష్యాలీ శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటిలో 3,024 మందికి వసతి, భోజనం తదితర సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. బందావతి నివాస్, బగేడియా ధర్మశాల, బొగొలా ధర్మశాల, అక్షయ పాత్ర ఫౌండేషన్ మరియు మోచీ సాహిలోని మున్సిపల్ కల్యాణ మండపంలో 5 చోట్ల హబిష్యాలీ కోసం ఈ సంవత్సరం ఉచితంగా వసతి, భోజనేతర ఏర్పాట్లు చేశారు. పూరీ జిల్లా యంత్రాంగం సమాచారం ప్రకారం ఈ సంవత్సరం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సమగ్రంగా 3,024 మంది హబిష్యాలీలు కార్తీక వ్రతం కోసం ముందస్తుగా వివరాలు నమోదు చేసుకున్నారు. వీరు మినహా ఇతరులు ఈ శిబిరాల్లో బస చేసేందుకు అనుమతించేది లేదని ఈ వర్గాలు స్పష్టం చేశాయి. జిల్లాల వారీగా నమోదైన హబిష్యాలీ వివరాలు.

జిల్లా	హబిష్యాలీలు
అంగుల్	15
బలంగీర్	14
బాలేశ్వర్	72
బర్‌గడ్	7
భద్రక్	79
బౌధ్	9
కటక్	51
దేవ్‌గడ్	8
ఢెంకనాల్	10
గజపతి	5
గంజాం	385
జగత్‌సింగ్ పూర్	53
జాజ్‌పూర్	63
ఝార్సుగుడ	2
కలహండి	5
కంధమల్	9
కేంద్రాపడా	22
కెంజొహర్	30
ఖుర్దా	911
కొరాపుట్	20
మల్కన్‌గిరి	1
మయూర్‌భంజ్	4
నవరంగ్‌పూర్	7
నయాగఢ్	310
నువాపడా	2
పూరీ	875
రాయగడ	2
సంబల్‌పూర్	27
సోన్‌పూర్	11
సుందర్‌గడ్	15

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- పెరిగిన ఓటర్ల సంఖ్య
- జనవరి 5న తుది జాబితా: సీఈవో నికుంజ బిహారి ధొలొ



వివరాలు వెల్లడిస్తున్న సీఈవో నికుంజొ బిహారి ధొలొ



పూరీ తీరంలో ఓటరు చైతన్యాత్మక సైకత కళాఖండం

భువనేశ్వర్: 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నికుంజ బిహారి ధొలొ శుక్రవారం విడుదల చేశారు. తుది జాబితాను వచ్చే ఏడాది (2024) జనవరి 5న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ముసాయిదా జాబితాలోని ఓటర్ల సంఖ్య 3,23,52,119 నుంచి 3,26,55,213కి పెరిగింది. ఈ లెక్కన అదనంగా 3,03,094 మంది ఓటర్లు పెరిగారు. ఇది 0.94 శాతం వృద్ధిగా సీఈవో వివరించారు. ముసాయిదా జాబితాలో 6,22,429 మంది ఓటర్లను చేర్చగా, 3,19,345 మంది ఓటర్ల పేర్లు మరణం, చిరునామా మార్పు మరియు బహుళ ఓటరు కార్డులు కలిగిన వ్యక్తులతో సహా వివిధ కారణాలపై తొలగించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల లింగ నిష్పత్తి పెరగడం శుభ సంకేతమని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో 1000:961 ఉన్న లింగ నిష్పత్తితో పోలిస్తే, ఇప్పుడు రాష్ట్రంలో లింగ నిష్పత్తి 1000:963గా వృద్ధి చెందిందన్నారు.

పెరిగిన బూత్‌ల సంఖ్య

ఓటర్ల సంఖ్య పెరుగుదల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా 37,606 నుంచి 37,809 బూత్‌ల సంఖ్యను పెంచారని సీఈవో తెలిపారు. కొత్త ఓటర్లను ముఖ్యంగా మహిళలు, యువకులు మరియు పీవీటీజీ గ్రూపుల సభ్యులను చేర్చుకునే ఉద్దేశంతో అన్ని రాజకీయ పార్టీలు తమ తమ బూత్ ఏజెంట్లను రంగంలోకి దింపాలని ఆయన అభ్యర్థించారు. సీఈవో ఒడిశా ఆధ్వర్యంలో నవంబర్‌లో ఓటర్ కార్డ్ రివిజన్ డ్రైవ్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో తమ ఓటరు కార్డుల్లోని లోపాలను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో సరిదిద్దుకోవాలని ప్రజలను కోరారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ మధ్య ప్రజల నుంచి తప్పులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తామని, డిసెంబర్ 26 లోపు ఫిర్యాదుల విచారణ జరుగుతుందని వెల్లడించారు.

కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి

2024 సంవత్సరం జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా చేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడంతో నమోదైన వివరాల్లో తప్పులు సవరించి, తాజా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఓటర్ల జాబితాల ప్రత్యేక సారాంశ సవరణ(ఎస్‌ఎస్‌ఆర్–24) శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీ వరకు ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో సాధారణ ప్రజానీకాన్ని చైతన్య పరిచేందుకు పూరీ సముద్రం నీలాద్రి తీరంలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ చైతన్యాత్మక సైకత శిల్పం ఆవిష్కరించారు.

పాకత్యాగం వేళలు ప్రకటన

భువనేశ్వర్: ఈనెల 28–29వ తేదీల మధ్య రాత్రి రాష్ట్రంలో పాక్షిక చంద్ర గ్రహణం కనిపించనుంది. ఈ సందర్భంగా పూరీలోని జగన్నాథ దేవస్థానంలో ఆ రోజు పాక త్యాగం (భోజన విరమణ) వేళల వివరాలను విడుదల చేశారు. జగన్నాథ దేవాలయం ఆమోదించిన పంచాంగం ప్రకారం అక్టోబర్ 29 తెల్లవారు జామున 1.04 గంటలు దాటిన 55 సెకన్లకు పాక్షిక చంద్ర గ్రహణం ప్రారంభమవుతుంది. 1 గంటల 19 నిమిషాల 7 సెకన్ల పాటు కొనసాగే గ్రహణం, తెల్లవారు జామున 2.24 గంటలకు ముగుస్తుంది. గ్రహణం ప్రారంభానికి కనీసం 9 గంటల ముందు ప్రజలు ఆహారం తీసుకోకూడదని ఆలయ పండితులు నిర్దేశించారు. అక్టోబర్ 28న సాయంత్రం 4.04 దాటిన 55 సెకన్ల నుంచి ఆహారం తీసుకోవడం (పాక త్యాగం) మానేయాలి. అక్టోబర్ 29న తెల్లవారుజామున 2.24 దాటిన 2 సెకన్లకు ఉపవాస దీక్ష ముగుస్తుంది. గ్రహణం రోజున (అక్టోబర్ 28–29) ప్రజలు దేవదేవతల పూజలు చేయడంతో పాటు పుణ్యకార్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. చంద్ర గ్రహణం కారణంగా జగన్నాథ దేవస్థానంలో నిత్య పూజాదుల కార్యక్రమం సర్దుబాటు చేశారు. సాంప్రదాయం ప్రకారం గ్రహణం ప్రారంభమైన సమయం నుంచి రత్న వేదికపై కొలువుదీరి నిత్య పూజాదులు అందుకుంటున్న మూల విరాటులు బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, శ్రీజగన్నాథునికి ప్రత్యేక అభిషేకాదులతో నైవేద్య సమర్పణ వేళలను ఖరారు చేశారు.

కుమార్ పూర్ణిమపై సందిగ్ధం

ఈసారి పాక్షిక చంద్ర గ్రహణం కుమార్ పూర్ణిమతో కలిసి వస్తోంది. దీంతో ఈ వేడుకను జరుపుకోవడంపై సర్వత్రా సందిగ్ధత నెలకొంది. కుమార్ పూర్ణిమ జరుపుకునే ప్రజలు రాత్రిపూట పూజ చేయడంపై గందరగోళ పరిస్థితి కలవరపరుస్తోంది. సాంప్రదాయం ప్రకారం పెళ్లి కావల్సిన అమ్మాయిలు పగటి పూట సూర్యపూజ చేసి, సాయంత్రం వేళలో ఆకాశంలో చంద్రుని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించాల్సి ఉంది. ఇలా పూజాదులు ముగిసిన తర్వాత కన్యలు ఉపవాసం వీడి ప్రసాదం ఆరగించడం ఆచారం. పాక్షిక చంద్ర గ్రహణం పురస్కరించుకుని ఈనెల 28న మధ్యాహ్నం నుంచి పాక త్యాగం (భోజన విరమణ) ప్రారంభం కానుండడంతో అదే రోజు కుమార పూర్ణిమను ఎలా జరుపుకోవాలి, ఈ పరిస్థితికి ప్రత్యామ్నాయ ప్రక్రియ ఏమైనా ఉందా అనే సందిగ్ధంలో యువతులు ఉన్నారు.

పంచాంగ కర్తల సలహా

పాక్షిక చంద్ర గ్రహణం, కుమార్ పూర్ణిమ పూజాదులపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో పంచాంగ కర్తలు సులభ మార్గం సూచించారు. శనివారం సాయంత్రం 4.05 గంటలకు ముందే చంద్ర పూజాదులు పూర్తి చేయాలని పంచాంగ కర్తలు సూచించారు. సాయంత్రం 4 గంటల తర్వాత చంద్ర దర్శనం నిషేధంగా పేర్కొన్నారు.

కార్తీకం ఎఫెక్ట్



కిటకిటలాడుతున్న చేపల మార్కెట్

- శుక్రవారం విపరీతంగా పెరిగిన మాంసాహార ధరలు

భువనేశ్వర్: కుమార్ పూర్ణిమ పురస్కరించుకొని ఈ ఏడాది కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. పవిత్ర కార్తీక మాసం నెల రోజుల పొడవునా రాష్ట్రంలో అత్యధికులు శాకాహారానికి పరిమితమవుతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రంలో మాంసాహార అంగళ్లు రద్దీతో కిటకిటలాడాయి. దీంతో ఇదే అదునుగా వ్యాపారులు ధరలు విపరీతంగా పెంచారు. మర్నాటి నుంచి నెల రోజులపాటు మాంసాహారానికి దూరంగా ఉండాలనే తపనతో ఎగబాకి చేపలు, మాంసం ఇతరేతర మాంసాహార పదార్థాలను ప్రజలు అధిక ధరలకు కొనుగోలు చేశారు. భకురా చేపలు కిలో ధర రూ.250, రోహి చేపలు కిలో రూ.200, రొయ్యలు కిలో ధర రూ.500, పీతలు రూ.1,000, నాటుకోడి రూ.500, బ్రాయిలర్ ధర రూ.250, వనరాజ్ కోడి ధర రూ.220, ఉప్పు చేపలు కిలో ధర రూ.150 నుంచి రూ.250, ఇలిసి చేపల ధర రూ.1,000 పలికింది.

● ఆత్మీయ వీడ్కోలు





పదవీ కాలం పూర్తి చేసుకున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్‌కు రాజ్ భవన్ సిబ్బంది శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ఉద్వేగ భరితంగా మాట్లాడారు. ఒడిశాకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలియజేశారు. ఇక్కడి ప్రజల అపారమైన ప్రేమ, గౌరవం మరియు ఆదరణ ఎప్పటికీ మరచిపోలేనని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఒడిశా యావత్ ప్రపంచానికి మార్గదర్శకం అవుతుందని ఆకాంక్షించారు. ఒడిశా పవిత్ర భూమి అని కొనియాడారు. ఈ పవిత్ర నేలకు, సద్గురువులకు ప్రణామాలు అర్పిస్తున్నానని ప్రసంగం ముగించారు.

– భువనేశ్వర్

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

భువనేశ్వర్: రాష్ట్రంలో పలుచోట్ల రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఉదయం పూట అనేక ప్రాంతాల్లో మంచు కమ్ముకొని ఉంటోంది. క్రమంగా ఈ వాతావరణం బలపడి చలి పుంజుకుంటుందని వాతావరణ శాఖ తెలియజేసింది. గురువారం రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలి పెరుగుతుందని స్థానిక భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం శుక్రవారం తెలిపింది. ఈ కేంద్రం సమాచారం ప్రకారం రానున్న 5 రోజుల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉంది. ఈ వ్యవధిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 3 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గుతుంది. రాష్ట్ర మారుమూల ప్రాంతాల్లో చాలా చోట్ల 15 డిగ్రీల కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. వాయువ్య దిశ నుంచి పొడి గాలి ప్రసరణ తగ్గడంతో చలి పెరుగుతుంది. శుక్రవారం ఉదయం రాష్ట్రంలో పలు చోట్ల పొగమంచు కమ్ముకోగా, జి.ఉదయగిరిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

● గత 24 గంటల్లో రాష్ట్రంలోని నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

ప్రాంతం	కనిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
ఉదయగిరి	13
కొరాపుట్	13.8
కొరై	14
దారింగ్‌బాడి	14.5
ఫుల్బాణి	15
నవరంగ్‌పూర్	17
అంగుల్	17
భవానీపట్న	17
హిరాకుడ్	17.2
ఝార్సుగుడ	17.3
సోన్‌పూర్	17.7

ముగిసిన ఉద్యోగుల సమ్మె



ఆందోళన చేపడుతున్న ఉద్యోగులు

జయపురం: అఖిల ఒడిశా కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈనెల 15వ తేదీ నుంచి కొరాపుట్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చేపట్టిన సమ్మె శుక్రవారంతో ముగిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు దిగంబర నాయక్, సాధారణ కార్యదర్శి అరుణ కుమార్ సాహుల నేతృత్వంలో ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు బ్యాంక్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అరుణ కుమార్ సాహు మాట్లాడుతూ డిమాండ్స్ సాధనకు ఆందోళన చేపడతామని ఈనెల 11వ తేదీన కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు, కార్యదర్శులకు నోటీసులు అందజేయడం జరిగిందని వెల్లడించారు. అయితే తమ డిమాండ్లపై సంబందిత అధికారులు స్పందించకపోవడంతో ముందుగా తెలిపిన విధంగానే మూడు రోజుల ఆందోళనలు చేపట్టామని పేర్కొన్నారు. మరలా నవంబర్ 13వ తేదీలోగా డిమాండ్లు పరిష్కరించకపోతే నవంబర్ 14వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఆఫ్ ఒడిశా వారు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో కొరాపుట్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ రథ్, కార్యదర్శి మనోజ్ కుమార్ దాస్, గోలక్ బిహారీ పాయికరాయ్, బిద్యాధర ప్రధాన్, అతుల్య కుమార్ మల్లిక్, మనోజ్ కుమార్ సాహు, శ్రీకాంత దాస్, సుశాంత బెహర, రామమణి దాస్, దినేష్ కుమార్ మిశ్ర, స్వదేశ్ మదల తదితరులు పాల్గొన్నారు.

ముకుందపూర్‌లో చోరీ



దుండగులు పగలుగొట్టిన బీరువా

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి ముకుందపూర్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముకుందపూర్‌లో నివాసముంటున్న రాజ్‌గుప్త అతని కుటుంబంతో కలిసి దసరా సెలవుల నేపథ్యంలో సంబల్‌పూర్‌లోని అత్తవారింటికి సోమవారం వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు పెరటి తలుపులు విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగలుగొట్టి అందులోని బంగారు పుస్తెల తాడు, రెండు బంగారు హారాలు, 6 ఉంగరాలు, ఒక బంగారు చైన్‌తో పాటు రూ.1.95 లక్షల నగదును దొంగలించారు. దీంతో పాటు ఇంటిలోని సీసీ కెమేరాకు సంబంధించిన హార్డ్ డిస్క్‌లు సైతం పట్టుకొని వెళ్లిపోయారు. గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన రాజ్ గుప్తా కుటుంబ సభ్యులు పెరటి తలుపులు తెరిచి ఉండటం గమనించి, దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. వెంటనే చందిలి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మంగులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

రాయగడ: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. జిల్లాలోని కాసీపూర్ సమితి జొడాఅంబొ గ్రామ సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో యుక్తిపాదొరొ గ్రామానికి చెందిన మంగులు నాయక్ (32) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, అదే సమితిలోని పాడాపాదొరొ గ్రామానికి చెందిన ముతేసింగ్(29) తీవ్రగాయాలకు గురయ్యాడు. సమాచారం అందుకున్న కాసీపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన ముతేసింగ్‌ను చికిత్స కోసం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మంగులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుణుపూర్ తహసీల్దార్‌గా లీలావతి



లీలావతి ఆచార్య

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ తహసీల్దార్‌గా లీలావతి ఆచార్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఆమె గజపతి జిల్లాలోని రాయగడ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తుండేవారు. గుణుపూర్ తహసీల్దార్‌గా ఉండే శరత్‌చంద్ర నాయక్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అవ్వడంతో ఆయన స్థానంలో ఆచార్య బాధ్యతలు చేపట్టారు.

కాల్పులు జరిపిన దుండగుడు అరెస్టు



అరెస్టు చేయబడిన సంజీవ్ ఖోశ్ల

జయపురం: సమితిలోని ఉమ్మిరి గ్రామంలో దసరా రాత్రి తుపాకీ కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో నిందితుడైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శుక్రవారం వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి బాగ్ గ్యాంగ్‌కి చెందిన సంజీవి ఖోశ్ల (22) అని తెలియజేశారు. ఉమ్మిరిలో ఉంటున్న ఒక గ్యాంగ్‌కి చెందిన రంజిత్ బాగ్ మరియు అతడి సోదరులు గౌతమ్ బాగ్, కార్తీక్ బాగ్ వారి సహచరులు, మరో గ్యాంగ్ ముఖ్యుడు సంజయ సున, సురేంద్ర నాయిక్‌ల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మిరి బస్టాండ్‌లో గాలిలోకి కాల్పులు జరిపారని వెల్లడించారు. రంజిత్ బాగ్ అతడి సోదరులు, అనుచరులతో సంజయ్ ఇంటిలోకి దూరి సంజయ్ సున కోసం గాలించారు. అచ్చట ఎవరూ లేకపోవడంతో ఇంటిలో ఉన్నవారిని తిడుతూ సంజయ్ గ్యాంగ్‌ను చంపుతామని హెచ్చరించారు. ఈ మేరకు సురేంద్ర ఫిర్యాదు చేయడంతో సంఘటన ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించి, సంజీవి ఖోశ్లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులను పట్టుకునేందుకు ఒక పోలీసు టీమ్‌ను ఏర్పాటు చేశామని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని తెలియజేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి గజలక్ష్మీ పూజలు


ఏర్పాటైన పూజా మండపం

రాయగడ: స్థానిక న్యూకాలనీలో శనివారం నుంచి మా గజలక్ష్మీ పూజలు ప్రారంభమవ్వనున్నాయి. గత 28 ఏళ్లుగా ఇక్కడ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా భారీ ఎత్తున గజలక్ష్మీ అమ్మవారి పూజలను నిర్వహించేందుకు కమిటీ సన్నాహాలు చేస్తోందని కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ సాహు తెలియజేశారు. నవంబర్ 8వ తేదీ వరకు ఈ పూజలు కొనసాగుతాయన్నారు.

మేరామాటి కలశాలు తరలింపు


కలశాలను భువనేశ్వర్‌కు తరలిస్తున్న అధికారులు

రాయగడ: దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు నివాళులర్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన మేరాదేశ్ మేరా మాటి అభిజాన్ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మట్టిని తీసుకొచ్చి కలశాలలో భద్రపరిచిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఆ మట్టిని ఢిల్లీకి తరలించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమయ్యింది. దీనిలో భాగంగా మట్టి కలశాలను రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు శుక్రవారం తరలించారు. జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి సుస్మిత బౌరి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, నెహ్రూ యువజన సంఘంకు చెందిన ఎంఎస్ లక్ష్మీనారాయణ శెఠి తదితరులు తీసుకెళ్లారు. ఈనెల 28వ తేదీన ఢిల్లీకి కలశాలు చేరుకోనున్నట్లు జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత ప్రధాన్ తెలియజేశారు.

కల్యాణ సింగుపూర్ తహసీల్దార్‌గా రంజన్ కుమార్


రంజన్‌కుమార్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ తహసీల్దార్‌గా రంజన్ కుమార్ మాసెంటి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎం.రామ్‌పూర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రంజన్ నియమితులయ్యారు. తహసీల్దార్ పరిధిలో రెవెన్యూ వసూళ్లపై ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కుమార్ తెలియజేశారు.

బీడీవోగా రాజీవ్ దాస్


రాజీవ్ దాస్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ బీడీవోగా రాజీవ్ దాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు బీడీవోగా విధులు నిర్వహించిన సునీల్ చంద్రఖొర నవరంగపూర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో దాస్ బాధ్యతలు స్వీకరించారు. సమితిలో సమస్యలను తెలుసుకుని, అభివృద్ధికి కృషి చేస్తానని దాస్ తెలియజేశారు. ఆయనకు సమితి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

అట్టాడకు కలెక్టర్ అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపికైన ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడును కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. అప్పలనాయుడు రచనల్లో జన జీవితం కనిపిస్తుందని, వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కారం అప్పలనాయుడికి రావడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు ఆంగ్లంలోకి అనువాదమైన తెలుగు బెస్ట్ స్టోరీస్ సంకలనాన్ని కలెక్టర్‌కు బహూకరించారు. కార్యక్రమంలో కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్ర రావు, న్యాయవాది మామిడి క్రాంతి, జానపద వైద్యులు బి.సత్యకర్మ తదితరులు ఉన్నారు.

'బాలల సైన్సు కాంగ్రెస్‌ను విజయవంతం చేయండి'

శ్రీకాకుళం రూరల్: జిల్లా డివిజన్ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని గురజాడ విద్యాసంస్థల్లో శుక్రవారం నిర్వహించిన ఒక రోజు బాలల సైన్సు కాంగ్రెస్ సెమినార్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మన ప్రాంతంలో ఉండే అనేక సమస్యలను పరిష్కరించే దిశగా సైన్స్ ప్రాజెక్టుల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం పర్యావరణ వ్యవస్థలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించే దిశగా సైన్సు ఉపాధ్యాయులు ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలన్నారు. ప్రాజెక్టు రూపకల్పన ఎలా చేయాలన్న విషయాన్ని ఆప్కాస్ట్ జిల్లా సమన్వయకర్త ఎస్.కుమార స్వామి వివరించారు.

వేతనాలు పెంచాలని ఆందోళన



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న దృశ్యం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుభాష్ చంద్రరావు తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని, మహిళా కార్మికులకు పురుషులతో సమానమైన వేతనం కల్పించాలని, ఇళ్లులేని నిరుపేద కార్మికులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ భారత్ ఖేత్ మజ్దూర్ సంఘ్ నేతలు పర్లాకిమిడి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఖేత్ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు జొన్న సుభాష్ చంద్రరావు, ఎం.జగన్నాథరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌ను కలిసి రాష్ట్రపతికి రాసిన వినతిని అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


పాలవలస ఆర్‌బీకేలో వైఎస్సార్ పొలంబడిపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్

బూర్జ: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్ అన్నారు. మండలంలో గల పాలవలస గ్రామ ఆర్‌బీకేలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వైఎస్సార్ పొలంబడిపై ఒక్క రోజు శిక్షణ, గ్రామ సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల వల్ల పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ, రసాయన ఎరువులు వాడకం వల్ల పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువ అవుతుందని అన్నారు. సేంద్రియ విధానం అలవర్చుకోవాలన్నారు. మండలంలో గల పరవాస్తు రామన్న పేట, పాలవలస, జంగాలపాడు, బొడ్లపాడు, అడ్డూరిపేట గ్రామాల్లో సాగు చేస్తున్న 55 మంది రైతులకు 14 వారాల పాటు వ్యవసాయ ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియ జేశారు. ఈ రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి ఏపీ ఆర్గానిక్స్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ వారితో ఒప్పందం, ధ్రువీకరణ చేయిస్తామన్నారు. 2023 ఖరీఫ్ పంటలకు ఈకేవైసీ చేయడం పూర్తయినట్లు తెలిపారు. మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో నవంబరు 10 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తూరు ఏడీఏ బి.రాజగోపాలరావు, శ్రీకాకుళం ఏడీఏ వెంకటరావు, పెద్దపేట ఆర్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త బీవీకే భగవాన్, మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పలువురు అధికార్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత


ట్రాక్టరుతో పట్టుబడిన టేకు కలప దుంగలు



ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ట్రాక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి గారబంద పంచాయతీ బాదురోపేట వద్ద ఒక ట్రాక్టర్‌లో టేకు కలప అక్రమంగా తరలిస్తుండగా పోలీసు అధికారి రవీంద్రకుమార్ పాత్రో, అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడిన టేకు కలప విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అటవీ సంరక్షణ అధికారి అశోక్‌కుమార్ బెహరా తెలియజేశారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ జరపడంతో విలువైన కలపను సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయినట్లు వెల్లడించారు. దీనిపై మహేంద్రగిరి అటవీ శాఖ రేంజ్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

'పిల్లలకు మత్తు ఔషధాలు విక్రయిస్తే చర్యలు'


మాట్లాడుతున్న సీతారాం

శ్రీకాకుళం అర్బన్: వైద్యుల సిఫారసు లేకుండా పిల్లలకు ఎలాంటి మత్తు ఔషధాలను విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం అన్నారు. కమిషన్ ఆదేశాలు మేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని డగ్లస్ స్కూల్ దగ్గరలో గల జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో మత్తు ఔషధాల విక్రయంపై దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పెద్దలు తోడు లేకుండా, పిల్లలు నేరుగా వైద్యుల సిఫారసు చీటీలు లేకుండా మందుల దుకాణాలకు వస్తే కోరెక్స్ వంటి దగ్గు మందులు ఆల్ప్రోజోలం 0.25,0.5 ఎం.జి,బెంజోడియ జెపినిస్, దయాజెపం, నైట్రాజెపం,ఆల్ప్రెక్స్ 0.25,రెస్టిల్ 0.5వంటి మందులే కాకుండా ఒపియోయిడ్స్, మోర్ఫైన్, కోడైన్,' ఇంటాలైనేటిక్ వంటి మత్తు ఇంజెక్షన్లు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించకూడదని తెలిపారు. పిల్లలకు ఇలాంటి మందులు విక్రయాలు జరపబోమని ఆయా షాపులు యజమానులు స్పష్టంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు ఉల్లంఘించి బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరుపుతున్నట్టు పౌర సమాజం దృష్టికొస్తే ఏపీఎస్‌సీపీసీఆర్2018@fmai.comనకు ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందించి చట్ట ప్రకార చర్యలతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫారసు చేస్తామని అన్నారు. జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు మాట్లాడుతూ బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరపబోమని ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలు వంద శాతం పాటించి ఆరోగ్యవంతమైన బాలల శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తామని అన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ మత్తు ఔషధాలు వాడడం వల్ల పిల్లల జీవితాలు ఏ విధంగా ఛిద్రం కాబోతాయో ఎలిమెంటరీ విద్య నుంచే పిల్లల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.యుగంధర్‌రావు, శ్రీకాకుళం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు గన్నెప్పడు, జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కరుణకుమార్ గుప్త, యజమానులు పాల్గొన్నారు.

రైతన్న నేస్తాలకు.. ఆపన్న హస్తాలు


కొత్తూరులోని ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

- పశువ్యాధి నిర్ధారణకు ల్యాబొరేటరీల ఏర్పాటు
- ఒక్కో కేంద్రంలో 73 రకాల పరీక్షలు
- జిల్లాలో 8 ల్యాబ్‌లతో సేవలు

కొత్తూరు: రైతన్న నేస్తాలకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. ఆపదలో ఉన్న పశువులకు అత్యవసర వైద్యం చేయించడానికి స్థానికంగానే సకల సదుపాయాలు కల్పిస్తోంది. అందులో భాగంగా జిల్లాలోని ఎనిమిది నియోజకర్గాల్లో నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ ల్యాబరేటరీలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు శ్రీకాకుళంలో బహుళార్థక ల్యాబొరేటరీ(ఏడీడీఎల్)ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబొరేటరీల్లో పశువైద్యంలో డిప్లమా పూర్తి చేసిన వారిని ల్యాబ్ టెక్నీషియన్‌గా నియమించారు. వీరు పశువుల పేడ, రక్తం, మూత్రం, పాలు, శీరం, హెచ్‌బి, పీహెచ్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

పక్కాగా వ్యాధి నిర్ధారణ

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో స్థానికంగా ఉండే పశువులకు వచ్చిన వ్యాధులను నిర్ధారించేందుకు శ్యాంపిళ్లను ఆయా మండల పశు వైద్యాధికారులు సేకరిస్తారు. వీటిని పరీక్షించిన తర్వాత ఫలితాల ఆధారంగా చికిత్స చేస్తారు. గతంలో అయితే ఇలా వ్యాధి నిర్ధారణ పక్కాగా జరిగేది కాదు. ఫలితంగా వందలాది పశువులు ప్రాణాలు కోల్పోయాయి. ఇప్పుడు ల్యాబ్‌ల ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుండడంతో మంచి మందులు అందిస్తూ పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. జిల్లాలో ఇంత వరకు ఈ ల్యాబ్‌ల ద్వారా 2021 మే నుంచి 2022 మార్చి వరకు 928 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు 4589 పశులకు పరీక్షలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 1434 పశువులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 6951 పశువులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి ప్రాణాలు కాపాడారు. దాదాపు ఐదు వేల మంది రైతులు లబ్ధి పొందారు. ఇప్పటికే జగనన్న సంచార పశువైద్య వాహనాలతో రైతులకు మేలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ల్యాబ్‌ల ద్వారా ఇంకా మేలు జరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కొత్తూరులోని నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ల్యాబొరేటరీ

నాణ్యమైన వైద్యం



నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ల ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. వీటిని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. రైతులు వీటిని చక్కగా ఉపయోగించుకుంటున్నారు.

– ఎం.కిశోర్, పశు సంవర్ధక శాఖ జేడీ

ఎంతో ఉపయోగకరం



నియోజవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల వల్ల మూగజీవాలకు చక్కటి వైద్య అందుతోంది. ఇవి ఎంతో ఉపయోగకరం. ఇలాంటి ల్యాబ్‌లు పశువుల ప్రాణాలు కాపాడుతున్నాయి.

– జి.నారాయణరావు, ఏడీ, కొత్తూరు సామాజిక పశువైద్య శాల, కొత్తూరు మండలం

తలనీలాల హక్కుకు వేలం

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మొక్కుల ద్వారా సమర్పించే తలనీలాల హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి ప్రసాద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ డోర్ డెలివరీని ఆదరించండి

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్న డోర్ డెలివరీ విధానాన్ని ప్రజలు, వ్యాపారులు మరింతగా ఆదరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం-2 డిపో గ్యారేజీ ఆవరణలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ ఆధ్వర్యంలో డోర్ డెలివరీ స్టిక్కర్‌ను శుక్రవారం ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థ వారు 2021లో ఈ డోర్ డెలివరీ విధానాన్ని ప్రారంభించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు కస్టమర్లందరూ ఏపీఎస్ఆర్టీసీ డోర్ డెలివరీని ఆదరిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకు డోర్ డెలివరీ ప్రచార మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన 90 పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల బరువు వరకు డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కస్టమర్లు అందరూ వినియోగించుకోవాలని కోరారు. శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కెఆర్‌ఎస్ శర్మ, 1, 2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఊరికి ప్రగతి కబురు

ఊరికి ప్రగతి కబురు అందుతోంది. పరిష్కారం కాకుండా ఉండిపోయిన సమస్యలకు ఓ మార్గం కనిపిస్తోంది. పొలిమేరలోని దారుల నుంచి ఊరిలోని కాలువల వరకు అన్ని నిర్మాణాలకు దండిగా నిధులు వస్తున్నాయి. ఇక విధులు నిర్వహించడమే తరువాయి. ఇప్పటికే ఆర్‌బీకేలు, నాడు-నేడు బడులు, కొత్త సచివాలయాలతో కళకళలాడుతున్న గ్రామాల్లో పాత సమస్యలు కూడా తీరిపోతే ప్రగతి 'పల్లె'వించినట్టే.



- తీరనున్న ఊరి సమస్యలు
- గడప గడపకూ కార్యక్రమంలో రూ. 88.30 కోట్ల పనులు మంజూరు
- తాజాగా రూ. 21కోట్లతో మెటీరియల్ కాంపోనెంట్ పనులు
- సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర పనులకు వెనులుబాటు
- అందుబాటులో నిధులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : పల్లెల అభివృద్ధికి నలువైపుల నుంచి నిధులు వస్తున్నాయి. ఒకవైపు గడప గడపకూ మన ప్రభుత్వం పనులు, మరోవైపు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ పనులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరందుకోనున్నాయి. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ. 88.30కోట్లతో 2691 పనులు మంజూరు చేయగా, తాజాగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ కింద రూ. 21కోట్లు కేటాయింపునకు సిద్ధంగా ఉన్నాయి. క్షేత్ర స్థాయి నుంచి ప్రతిపాదనలు రాగానే పనులతో పాటు నిధులు మంజూరు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. కాంట్రాక్టర్లు చొరవ చూపించి పనులు పూర్తి చేయడమే మిగిలి ఉంది.

మండలానికి రూ. 60లక్షలు

ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ కింద మండలానికి రూ. 60లక్షలు చొప్పున ఇప్పటికే కేటాయించేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు. కలెక్టర్ ఇప్పటికే ప్రతిపాదనలు కోరారు. క్షేత్రస్థాయి నుంచి ప్రతిపాదనలు రాగానే పనులతో పాటు నిధులు మంజూరు చేయనున్నారు. ఒక్కో మండలానికి రూ. 60లక్షలు చొప్పున జిల్లాలో ఐటీడీఏ పరిధిలోకి రాని 25 మండలాలకు మంజూరు కానున్నాయి.

చొరవ చూపాలి

జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. అటు గడప గడపకూ మన ప్రభుత్వం కింద చేపడుతున్న పనులకు, త్వరలో మంజూరు చేయనున్న ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ పనులకు చకచకా నిధులు విడుదల చేయనున్నాం. కాంట్రాక్టర్లు మరింత చొరవ చూపాలి. చేసిన పనుల మేరకు బిల్లులు అప్‌లోడ్ చేస్తే వెంటనే నిధులు విడుదల చేస్తాం. బిల్లుల కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు అవసరమైన నిధులు విడుదల చేస్తాం.

– శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

ఐటీడీఏ మండలాలకు రూ. కోటి 20లక్షలు

ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంత మండలాలకు రెట్టింపు నిధులు మంజూరు కానున్నాయి. మందస, మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, హిరమండలం మండలాలకు చెరో రూ. కోటి 20లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అదనపు నిధులు కేటాయిస్తుంది. ఐదు ఐటీడీఏ మండలాలకు గాను రూ. 6కోట్లు వరకు ఖర్చు చేస్తారు.

అందుబాటులో నిధులు



అటు గడప గడపకూ మన ప్రభుత్వం పనులకు, ఇటు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయి. పనులు ప్రారంభించి, పూర్తి చేస్తే చాలు నిధులు విడుదలవుతాయి. చేసిన పనుల మేరకు బిల్లులు అప్‌లోడ్ చేస్తే తదనుగుణంగా సంబంధిత పనులు చేసిన వారి ఖాతాలో సొమ్ము జమ కానుంది. అయితే గడప గడపకూ మన ప్రభుత్వం కింద చేపట్టిన పనులు మిగతా జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో వేగంగా జరగడం లేదు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు రూ. 88.30కోట్లతో 2691పనులు మంజూరు చేయగా ఇప్పటివరకు 1644 పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో 376 పూర్తయ్యాయి. నిధుల వినియోగంలోకి వస్తే రూ.13.20కోట్లు ఖర్చు చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా, ఏపీఈడబ్ల్యూఐడీసీ తదితర శాఖల పర్యవేక్షణలో జరుగుతున్న పనులు మరింత ఊపందుకోవల్సిన అవసరం ఉంది. నిధులకు ఢోకా లేదు.. పనులు చేయండి అని అధికారులు వెంట పడుతున్నారు.

అత్త మృతదేహానికి కోడలు తలకొరివి


అత్త మృతదేహానికి తలకొరివి పెడుతున్న కోడలు.

టెక్కలి రూరల్: అత్త మృతదేహానికి కోడలు తలకొరివి పెట్టిన ఘటన మండలంలోని బొరిగిపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బొరిగిపేట గ్రామానికి చెందిన దివ్వల చిలకమ్మ(70) అనే వృద్ధురాలు గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆమె కుమారుడు పన్నెండేళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. తలకొరివి పెట్టేందుకు ఎవరూ లేకపోవడంతో కోడలు దివ్వల కృష్ణవేణి తన అత్తకు తలకొరివి పెట్టింది.

రైలు నుంచి జారిపడిన యువకుడు


పాపారావుకు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో గుణుపూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే ప్రయత్నంలో ఓ యువకుడు జారిపడి గాయాలపాలయ్యాడు. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన మరడ పాపారావు అనే యువకుడు భువనేశ్వర్ చేరుకునేందుకు స్టేషన్‌కు వచ్చాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంలో ఉన్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ బయల్దేరిపోవడంతో రైలు ఎక్కే ప్రయత్నంలో జారిపడిపోయాడు. అక్కడున్న వారు రక్షించి 108 అంబులెన్సుకు సమాచారం అందించడంతో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కౌలు రైతు ఆత్మహత్య


గడ్డి మందు తాగి మృతి చెందిన రాకోటి రామయ్య

నందిగాం: మండలంలోని జడ్యాడకు చెందిన రాకోటి రామయ్య(59) అనే కౌలు రైతు శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామయ్య వ్యవసాయ కూలీగా ఉంటూ కొంత భూమి కౌలుకు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి రాకపోతే అప్పు తీర్చలేనేమోనని మనస్తాపం చెంది శుక్రవారం పొలంలో గడ్డి మందు తాగి ఇంటికి వచ్చారు. ఇంట్లో నిద్రిస్తున్న రామయ్య నుంచి గడ్డి మందు వాసన రావడం గమనించిన భార్య శకుంతల చుట్టు పక్కల వారి సాయంతో 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామయ్య మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమీర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు మహర్షి వాల్మీకి జయంతి

పార్వతీపురంటౌన్: మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత పార్వతీపురం మన్యం జిల్లా అధికారి ఎస్. కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవానికి వెనుబడిన తరగతులకు చెందిన సంఘం నాయకులు, సభ్యులు, ప్రజలు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: కడుపు నొప్పి తాళలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాలప్డాడు. విజయనగరంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని రాయవలస గ్రామానికి చెందిన ఊడిగ వెంకటరమణ (34) స్థానిక ఆర్టీసీ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దసరాకు సొంతూరు వెళ్లిన వెంకటరమణ కడుపునొప్పి విపరీతంగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. అయితే మళ్లీ వాచ్‌మన్ వచ్చిన రమణ గురువారం కడుపునొప్పి తట్టుకోలేక పురుగు మందు తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై ఎ.నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రదీప్‌నగర్‌లో చోరీ

ప్రదీప్‌నగర్‌లో దొంగలు ఇంట్లో చొరబడి బంగారం, వెండి వస్తువులను దోచుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ప్రదీప్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచమన్‌గా పనిచేస్తున్న చిన్నికృష్ణ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఇల్లు తీసుకుని భార్యా,బిడ్డలతో ఉంటున్నాడు. అయితే గురువారం రాత్రి విధులకు కుటుంబ సభ్యులతో కలిసి అపార్ట్‌మెంట్‌కి వెళ్లి శుక్రవారం తెలవారు జామున 5 గంటల ప్రాంతంలో సొంతింటికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పాటు ఇంట్లో బీరువాలో ఉన్న రెండుంపావు తులాల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి వస్తువులు పోయినట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ ఎస్సై ఎ.అశోక్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ మృతి



మృతిచెందిన వీఆర్‌ఓ జమ్మయ్య

సాలూరు: సాలూరు మండలంలోని తుండ పంచాయతీ వీఆర్‌ఓగా పనిచేస్తున్న మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన గంట జమ్మయ్య(47) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విధినిర్వహణలో భాగంగా, తహసీల్దార్ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరయ్యేందుకు వీఆర్‌ఓ జమ్మయ్య మామిడిపల్లి మీదుగా ద్విచక్రవాహనంపై వస్తుండగా జనవరి వలస సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న గుంతలోని రాయిపైకి వాహన ఎక్కిన నేపథ్యంలో అదుపు తప్పి పడిపోవడంతో తలకు దెబ్బతగిలి అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం జరిగే ముందు వరకు జమ్మయ్య హెల్మెట్ ధరించాడని, అంతో ఫోన్ రావడంతో హెల్మెట్‌ను తీసి బండి ట్యాంక్ పెట్టుకున్నాడని, హెల్మెట్ ధరించి ఉంటే మరణం సంభవించేది కాదేమోనని స్థానికులు అంటున్నారు.

ఆత్మహత్యయత్నం చేసిన వ్యక్తి..



వేపాడ: కేజీహెచ్‌లో మృతిచెందిన ఈశ్వర్రావు

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన పిల్లా ఈశ్వర్రావు (35) పురుగుమందు తాగి అస్వస్థతకు గురికాగా విశాఖలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈశ్వర్రావు తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో మనస్తాపం చెందిన గురువారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య భవాని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

సందర్శన

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపికాపాటిల్ శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్సై ఎల్.దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

వనంలో వెలసిన పైడితల్లి

- పెద్దచెరువులో ప్రతిరూపాలు
- వనంగుడిలోనే కొలువైన అమ్మవారు



వనంగుడిలో పైడితల్లి అమ్మవారు



వనంగుడిలో అద్దాల మంటపం

విజయనగరం టౌన్: పైడితల్లమ్మ చరితం విన్నా..కన్నా.. తెలుసుకున్నా..పుణ్యఫలమే. ఆ తల్లిని మనసులో స్మరిస్తూ కోర్కెలు కోరితే..అవి తీరిన కొద్దిరోజుల్లోనే ప్రపంచంలో ఎక్కడున్నా తల్లిని దర్శించుకునేందుకు తరలివస్తారు. అక్కడితో ఆగకుండా ఏటా అమ్మను దర్శించుకోవడానికి తొలేళ్ల నుంచి సిరిమానోత్సవం వరకూ ఉంటూ పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తారు. చల్లంగా చూడుతల్లీ..మళ్లీ వచ్చి దర్శించుకుంటామంటూ ఆ ప్రకృతి స్వరూపిణి పైడితల్లిని భక్తిపూర్వకంగా ప్రార్థిస్తారు. అంతటి మహిమాన్వితమైన ఆ పైడితల్లమ్మ వెలిసింది విజయనగరం రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలోనే..

పైడితల్లి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడికి వెళ్లడం ఆనవాయితీ. సిరిమానోత్సవం కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. అయితే అమ్మ సాక్షాత్కరించింది మాత్రం వనంలోనే. అప్పట్లో రైల్వేస్టేషన్ ప్రదేశం పూర్తిగా అటవీ ప్రాంతంలా ఉండేది. పెద్దచెరువు దాటిన తర్వాత అంతా దట్టమైన అరణ్యప్రాంతం. పెద్దచెరువు పశ్చిమభాగాన వనంతో కలిసి ఉన్న చెరువులో వెలిసిన చిన్నారి పైడితల్లి ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనం ఉంది.

అన్నను వారించినా..

బొబ్బిలి యుద్ధం సమయంలో రాబోయే ఉపద్రవాన్ని గుర్తించి తన అన్న విజయరామరాజును పైడితల్లమ్మ ముందే హెచ్చరించింది. యుద్ధం వద్దని వారించినా ఆమె మాటను అన్న విజయరామరాజు పెడచెవిన పెట్టాడు. యుద్ధంలో విజయరామరాజును తాండ్రపాపారాయుడు హతమార్చిన వార్త ఆమె చెవిన పడిన వెంటనే అన్నంటే ఎంతో అభిమానం. వాత్సల్యం ఉన్న ఆమె ఆ వార్త విని తట్టుకోలేక తాను నిత్యం పూజించే మహాశక్తిని ప్రార్థిస్తూ పెద్దచెరువులో దూకి లీనమైంది.

పెద్దచెరువులో ప్రతిరూపాలు

అదేరోజు రాత్రి పైడితల్లి తనను చిన్ననాటి నుంచి సంక్షించిన విజయనగరానికి చెందిన పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి తన ప్రతిరూపాలు పెద్దచెరువు పశ్చిమభాగంలో లభ్యమవుతాయని, వాటిని తీసి ప్రతిష్ఠించి పూజలు చేయాలని కోరింది. ఆ ప్రకారంగానే రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పెద్దచెరువులో బెస్తవారి సహాయంతో అప్పలనాయుడు వెతకగా ఆ నీటిలో అమ్మ ఓ మెరుపులా సాక్షాత్కరించి తానిక్కడ ఉన్నాననే సంకేతాన్నిచ్చింది. వెంటనే వారు ఆ ప్రదేశంలో వెతకగా విగ్రహాలు లభ్యమయ్యాయి. అనంతరం అమ్మవారిని ప్రతిష్ఠించి గుడి నిర్మించారు. అప్పట్లో ఆ ప్రాంతమంతా దట్టమైన అరణ్యం కావడంతో వనంగుడి అని పేరువచ్చింది. అమ్మకు సిరిమానోత్సవం కోసం చదురు కట్టి నిర్వహించడం, కోటశక్తికి పూజలు చేయడం మూలంగా చదురుగుడి వద్ద సిరిమానోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా మారింది.



వనంగుడిలో బలిహరణ ప్రదేశం

అమ్మను ప్రతిష్ఠించిన స్థలమే బలిహరణ ప్రాంతం

పైడితల్లి అమ్మవారి వనంగుడిలో బలిహరణ ప్రదేశం వద్ద భోగం పెట్టడం ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తుంది. పైడితల్లి అమ్మవారికి భక్తులు ఇక్కడే ముందుగా పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ముందుగా బలిహరణం ప్రదేశాన్ని చేతులతో స్పర్శించి, కళ్లకద్దుకుంటూ అమ్మను చూసేందుకు ముందుకు వెళ్తారు. అప్పట్లో ఆలయం పెద్ద చెరువుకు ఎదురుగా ఉండేది. కానీ జనసంచారం దృష్ట్యా ఆలయాన్ని దాదాపు 18 ఏళ్ల కిందట రైల్వేస్టేషన్ వైపు ముఖ ద్వారంగా ఉంచి అభివృద్ధి చేశారు.

పూర్వజన్మసుకృతం



మా నాన్నగారు నేతేటి శ్రీనివాస్ సిరిమానును అధిరోహించారు. పైడితల్లికి సేవ చేసే భాగ్యం నాకు దక్కింది. ఊహ తెలిసినప్పటి నుంచి అమ్మసేవలో తరిస్తున్నాను. ఎందరో భక్తులు అమ్మ మహిమలతో పాటు వారికి జరిగిన మంచి పనుల గురించి నాతో అనుభవాన్ని పంచుకుంటారు.

నేతేటి ప్రశాంత్, వనంగుడి అర్చకుడు, విజయనగరం.

వనంగుడిలో దుర్గమ్మ, ముత్యాలమ్మ

వనంగుడిలో పైడితల్లి అమ్మవారికి ఇష్టమైన దుర్గాదేవి, ముత్యాలమ్మ అమ్మవార్లు కొలువై పూజలందుకుంటున్నారు. ప్రతి నెలా మూలా నక్షత్రం రోజున దుర్గమ్మకు, అమ్మవారికి చండీహోమం శరన్నవరాత్రుల రోజుల్లో దుర్గాదేవికి అలంకరణ, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. అమ్మవారి పాత విగ్రహానికి ఆలయం వెనుక ప్రత్యేక గది కట్టి నిత్యపూజలు చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ప్రాంతం కావడంతో నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి, తరిస్తారు.

అమ్మవారికి అద్దాల మంటపం

2008లో వనంగుడిలోనే అమ్మవారికి విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గాదేవికి ఉన్న విధంగానే అద్దాల మంటపం ఏర్పాటుచేశారు. ఈ మంటపం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఊయలలో పైడితల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊంజల్ సేవలు నిర్వహిస్తారు. రోజూ పంచహారతుల అనంతరం సేవ నిర్వహిస్తారు. భక్తులు అద్దాల మంటపంలోని ఉయ్యాల్లో అమ్మవారి చిత్రపటానికి మొక్కి ప్రదక్షిణ చేస్తారు. అద్దాల మంటపంతో పాటూ యాగశాల, స్నపన మందిరం, వంటశాల ప్రస్తుతం ఉన్నాయి.

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

- కలెక్టర్ నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: జిల్లాలో ధాన్యం దిగుబడుల అంచనాకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, రైతు పండించిన చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ సలహామండలి, నీటి పారుదల సలహామండలి సమావేశాన్ని శుక్రవారం ఆయన కలెక్టరేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రాప్ సోషల్ ఆడిట్ చేసి ఎక్కడైనా ఈక్రాప్ జరగకపోతే వెంటనే చేయించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కేంద్రాలు సిద్ధం చేయాలని, ఈనెల 31నాటికి సిబ్బంది నియామకం పూర్తి కావాలని ఆదేశించారు.

జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో వరిపంట

జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో వరిపంట వేశారని, 3.18 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్ పాల్ అన్నారు. నవరంబ్ చివరి వారం, డిసెంబర్ మొదటి వారాల్లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా ఉద్యాన అధికారి కేవీఎస్ఎన్ రెడ్డి, జిల్లా జలవనరుల శాఖాధికారి ఆర్.అప్పలనాయుడు, జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా సహకార అధికారి సన్యాసినాయుడు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ జీఎల్ఎన్‌మూర్తి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డొల్లు పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల కోసం భూ సమస్యను పరిష్కరించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్‌ను ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, ఆర్‌డీఓలు కలిసి వెంటనే భూ సంబంధిత అంశాలపై చర్చించుకుని పరిష్కరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొత్తవలస మండలం రెల్లిలో 158 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్ కోసం పెదరావు పల్లి గ్రామంలో ఉన్న 70 ఎకరాల డి.పట్టాభూములు, కంటకాపల్లి భూములకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ సూర్యకళకు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎంఈజీపీ కింద ఆయా సంస్థలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సింగల్ డెస్క్ పోర్టల్ కింద పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డీఓ సూర్యకళ, ఏపీఐఐసీ జీఎం యతిరాజు, డీఐసీ జనరల్ మేనేజర్ పాపారావు, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా కంటి శస్త్రచికిత్సలు పూర్తిచేయండి

డిసెంబర్‌లోగా కంటి శస్త్రచికిత్సలను పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా చేయాల్సిన శస్త్రచికిత్సలపై, కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎంహెచ్ఓ భాస్కర్రావు, డీసీహెచ్ఎస్ గౌరీశంకర్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చెరువులో జారిపడి యువకుడి మృతి



ప్రదీప్ మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ గ్రామానికి చెందిన యువకుడు వడసాపు ప్రదీప్(20) శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించిన ప్రదీప్ రెండు రోజుల క్రితం ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. దీంతో ప్రదీప్ తల్లిదండ్రులు ఆ సమాచారాన్ని యువతి తల్లిదండ్రులకు తెలిపారు. వెంటనే యువతి తల్లిదండ్రులు ప్రదీప్ ఇంటికి వచ్చి మాట్లాడినప్పటికీ సొంతింటికి వెళ్లడానికి యవతి నిరాకరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ప్రేమికులిద్దరూ కుదమ పొలిమేరలో ఉన్న తామర చెరువుకు బట్టలు ఉతకడానికి కలిసి వెళ్లగా ,ప్రమాదవశాత్తు ప్రదీప్ కాలుజారి చెరువులో పడిపోయాడు. ఈ సమాచారాన్ని యువతి గ్రామస్తులకు సమాచారం అందించగా వారు వచ్చే లోగానే మృతిచెందాడు. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి..

నెల్లిమర్ల: స్థానిక జూట్‌మిల్లు గేటు సమీపంలో రైలు ఢీకొట్టి నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన ధర్మవరపు రమణ(53) శుక్రవారం మృతిచెందాడు. రమణ రైలు పట్టాలు దాటుతుండగా ఎదురుగా వస్తున్న రైలును గమనించకపోవడంతో ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలై, అక్కడికక్కడే మరణించాడు. రమణ రజకవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పీఎంపాలెం (విశాఖపట్నం): జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. బొబ్బిలి మండలం అలజంగికి చెందిన కిలారి నవీన్(21) అవివాహితుడు. స్థానికంగా ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బొబ్బిలి ప్రాంతానికి చెందిన కల్యాణ చక్రవర్తి పీఎంపాలెంలోని ఓ ఆలయంలో అర్చకుడు. వీరిద్దరూ పీఎంపాలెం చివరి బస్టాప్ ప్రాంతంలో ఒకే రూమ్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో రూమ్ నుంచి బయటకు వచ్చి రెండో బస్టాప్ వద్ద టిఫిన్ చేశారు. తర్వాత ఎండాడ బంకులో పెట్రోల్ వేయించడానికి బైక్(బులెట్)పై బయలుదేరారు. అక్కడ పని ముగించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. దిశ పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనం నిలిపి.. మూత్ర విసర్జనకు వెళ్లారు. తిరిగి బయలుదేరారు. నవీన్ బైక్ నడుపుతుండగా, చక్రవర్తి వెనుక కూర్చున్నాడు. ఈ క్రమంలో ముందు వెళుతున్న వాహనం అకస్మాత్తుగా ఆగడంతో నవీన్ తొట్రుపాటుకు గురయ్యాడు. బైక్ హ్యాండిల్ లారీకి తగలడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. వెనుకనే వస్తున్న మరో లారీ నవీన్‌ను సుమారు 100 మీటర్ల దూరం ఈడ్చుకుపోవడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మరణించాడు. చక్రవర్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. నవీన్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం పూర్తి చేశారు. చక్రవర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ అరెస్ట్

కొత్తవలస: సారా తరలిస్తున్న కక్కల లక్ష్మి ని మండలంలోని రామలింగాపురం వద్ద శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ సీహెచ్ రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, నిందితురాలి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్సై పి. నరేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానం ఈఓగా సూర్యనారాయణ

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల కార్యనిర్వహణ అధికారిగా వీవీ సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతవరకు ఈఓగా బాధ్యతలను నిర్వహించిన నగేష్ విశాఖపట్నంలోని పలు దేవాయాలకు కార్యనిర్వాహణాధికారిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు తోటపల్లి దేవస్థానానికి నూతన ఈఓగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామంలో పని చేస్తున్న వీవీ సూర్యనారాయణను నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సూర్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వేడుకగా శ్రీ చక్రస్నానం



స్వామి వారికి శ్రీచక్రస్నానం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం పరిధిలో పవిత్ర నాగావళి నదీ తీరంలో శుక్రవారం నిర్వహించిన శ్రీచక్ర స్నానం ఘనంగా నిర్వహించారు. స్వామివారి పవిత్రోత్సవాల భాగంగా సుప్రభాత సేవ, తిరువీధి తదితర కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట నాగావళి నదీ తీరం వరకు తిరువీధిని నిర్వహించి అభిషేకాలను నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి నిర్వహించిన పూజల్లో భక్తులు అధికంగా పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.

మాత, శిశు మరణాలు జరగకుండా చర్యలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మాత, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెలలో సంబంధించిన మాత, శిశు మరణాలపై ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత, శిశు మరణాలు ఎందుకు సంభవించాయో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మాత, శిశు మరణాలు సంభవించాయని తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రసవ తేదీకి ముందుగానే వారిని ఆస్పత్రికి చేర్చి సుఖ ప్రసవం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులు వైద్యం కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలను వినియోగించుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులకు ప్రసవ సమయానికి హైరిస్క్ తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి ముందుగానే రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో డీఐఓ అచ్యుతకుమారి, డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చెరకు 'మద్దతు' రూ.3080

- ప్రకటించిన ఈఐడీ ప్యారీస్ కర్మాగారం
- ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఐడీ ప్యారీస్ ఫ్యాక్టరీ ప్రతినిధులు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారం రైతులకు తీపికబురు అందించింది. ఈ ఏడాది చెరకు టన్నుకు రూ.3080 మద్దతుధర చెల్లిస్తున్నట్లు యాజమాన్యం ప్రతినిధులు వెల్లడించారు. గతేడాది కంటే టన్నుకు రూ.100 పెంచామన్నారు. ఈనెల 30 నుంచి రైతుల దగ్గర తీసుకొచ్చిన చెరకును క్రషింగ్ చేస్తామని వివరించారు. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు శుక్రవారం కర్మాగారం వద్ద మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కర్మాగారం సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం చేసుకున్నామని తెలిపారు. గతేడాది 4.77 లక్షల మెట్రిక్ టన్నులు చెరకు క్రషింగ్ చేసినట్లు వెల్లడించారు. 2023-24 ఏడాదికి సంబంధించి అక్టోబర్ -2023 నుంచి సెప్టెంబర్ 2024 మధ్య చెరకును ఎకరాలో మొక్కదూరపు సాళ్ల పద్ధతిలో నాలుగు అడుగుల మధ్య నాటితే రూ.12 వేల రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. మమ్ము సాగుచేసే రైతులకు ఎకరాకు రూ. 2500 రాయితీ ఇస్తున్నామన్నారు. మొక్క రాయితీ పొందేందుకు రైతులకు విడిగా ఒక ఎకరం నుంచి 30 టన్నుల చెరకు సరఫరా చేయాల్సి ఉందని వివరించారు. 25 టన్నుల వరకూ సరఫరా చేస్తే దామాషా పద్ధతిలో రాయితీ ఇస్తున్నామని, 25 టన్నుల కంటే సరఫరా, ఉత్పత్తి తగ్గితే రాయితీ వర్తించదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో కేన్ డీజీఎం జె.రాజేంద్ర, మేనేజర్ వి.మురళీకృష్ణ, హెచ్ఆర్ పి.శ్యామ్‌కుమార్, ఏజీఎం ఫైనాన్స్ తదితరులు పాల్గొన్నారు.

రూ.833 కోట్ల బిల్లుల చెల్లింపు

- హౌసింగ్ పీడీ వి.శ్రీనివాస్



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వి.శ్రీనివాస్

రామభద్రపురం: జిల్లాలో జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు, వివిధ దశల్లో ఉన్న వాటికి లబ్ధిదారులకు దాదాపు రూ.833 కోట్ల వరకు బిల్లులు చెల్లించామని హౌసింగ్ పీడీ వి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశభవనంలో ఎంపీడీవో రమామణి, హౌసింగ్ డీఈఈ రత్నాకర్‌తో కలిసి శుక్రవారం ఆయన ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పురోగతి సాధించాలని దిశానిర్దేశం చేశారు. నిర్మించిన ఇళ్లలో తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు మూడు దఫాలు నోటీసులు జారీ చేసి అనంతరం పట్టాలు రద్దు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో 78,042 ఇళ్లు మంజూరు కాగా 37,896 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. అలాగే గ్రౌండ్ స్థాయిలో 18,868, పునాదుల స్థాయిలో 13,248,9 అడుగుల స్థాయిలో 3.801, శ్లాబ్ స్థాయిలో 2,803 ఉన్నాయని వెల్లడించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు బాల బాలికల జట్ల ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాల బాలికల జట్లతో పీడీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి

కొత్తవలస: మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-14 విభాగంలో బాల బాలికల జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో గల 9 నియోజకవర్గాల నుంచి 220 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారు. ఈ ఎంపికలను నియోజకవర్గం ఇన్‌చార్జ్ కె.కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిబాబు పర్యవేక్షణలో ఈ ఎంపికలను చేపట్టగా అండర్ -14 విభాగంలో బాలికల జట్టుకు 12 మంది, బాలుర జట్టుకు 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు వచ్చేనెల 9,10 తేదీల్లో అల్లూరిసీతారామరాజు జిల్లా అరకులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంఈఓ బండారు శ్రీనివాసరావు, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, సర్పంచ్ ఎం.రామస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేవీఎన్ రాజు, హెచ్ఎం సీహెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 10న మంగళగిరిలో కృత్రిమ చేతుల పంపిణీ

- దివ్యాంగుల సంక్షేమ శాఖ ఎ.డి జగదీష్
- రిజిస్ట్రేషన్ హెల్ప్‌లైన్ నంబర్ 7207403150



జగదీష్, ఎ.డి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ

విజయనగరం అర్బన్: మోచేతి కింద కనీసం 4 అంగుళాల చేయికలిగిన దివ్యాంగులకు కృత్రిమ చేతులను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం మంగళగిరిలో డిసెంబర్ 10న జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఎ.డి. జీబీవీజగదీష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంపిణీ వివరాలను ప్రకటించారు. ఎల్లెన్ మెడోస్ ప్రోస్తేటిక్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సంస్థ 'మంగళకరం' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి హాజరయ్యే అభ్యర్థులు ముందుగా హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ 7207403150ను సంప్రదించి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఎలాంటి అర్హతలు, నిబంధనలు లేవని స్పష్టం చేశారు. ఏ వయసు వారైనా, ఏ స్థాయి వారైనా అధునాతనమైన ఈ పరికరంతో అనవరమైన పనులను చేసుకోవడానికి వీలుంటుందని, అమెరికా నుంచి దిగుమతి చేసిన ఈ పరికరాన్ని సులభంగా వినియోగించవచ్చన్నారు. సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి సూచనల మేరకు జిల్లా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.